క్లుప్తంగా

ప్రేరణ సఖిగా ఎంపికైన డ్వాక్రా మహిళ



మహిళా సంఘం సభ్యురాలికి డ్రెస్‌ను అందిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన డ్వాక్రా సంఘం సభ్యురాలు జ్యోతమ్మ ప్రేరణ సఖిగా ఎంపికైంది. ఈనేపథ్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆమెకు డ్రెస్‌ను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సాయినగర్‌కు చెందిన శారదాంబ మహిళా పొదుపు సంఘం సభ్యురాలు జ్యోతమ్మ తోలు బొమ్మలు తయారీ రంగంలో పారిశ్రామికవేత్తగా మంచి ప్రతిభ కనబరిచినందుకు మెప్మా విభాగం డైరెక్టర్ ప్రేరణ సఖిగా ఎంపిక చేశారన్నారు. ఆమెకు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రేరణ సఖి ప్రశంసా పత్రం అందిందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ విజయభాస్కర్ రాయల్, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు



రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ శ్రీనివాసులు

బత్తలపల్లి: పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు, వేసవిలో పాడి పశువులకు పచ్చి మేత లభించేలా ప్రభుత్వం రాయితీపై గడ్డి విత్తనాలు అందిస్తోందని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో రైతులకు రాయితీ గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో రైతులు పచ్చి పశుగ్రాస కొరత ఎదుర్కొంటారని, దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గడ్డి విత్తనాల పంపిణీ చేపట్టిందన్నారు. విత్తనాలు స్థానిక పశు వైద్యశాలతో పాటు డి.చెర్లోపల్లిలోని పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీ పోను రైతు వాటాగా ఒక్క కిలోకు రూ.23 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సీఎస్‌హెచ్ 24 మల్టీ కట్ రకం విత్తనాలు ఉన్నాయని, పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లౌడ్ స్పీకర్ వితరణ

నల్లమాడ: ఆస్ట్రేలియాకు చెందిన సత్యసాయి బాబా భక్తులు రూ.10 వేలు విలువ చేసే లౌడ్ స్పీకర్‌ను శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేమనారాయణ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా మార్గంలో ఆస్ట్రేలియా భక్తులు మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మోహన్, అక్బర్, నరసింహారావు, అరుణ రేఖ, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రోబోటిక్స్ డే



పాఠశాలలో రోబోటిక్స్ డేను జరుపుకుంటున్న దృశ్యం

ముదిగుబ్బ: స్థానిక పీవీఎస్ పాఠశాలలో శుక్రవారం రోబోటిక్స్ డే నిర్వహించారు. విద్యార్థులు రోబో నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు మాట్లాడుతు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసే ఉద్దేశంతో మండల స్థాయిలో మొదటి సారిగా రోబోటిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తయారు చేసిన రోబో నమూనాలను తిలకించి అభినందనలు తెలిపారు.

ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయప్రసాద్

నల్లచెరువు: గ్రామాల్లోని ప్రజలకు ఇంకుడు గుంతల ఉపయోగాలపై అవగాహన కల్పించాలని డ్వామా పీడీ విజయప్రసాద్ ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏపీఓ మంజుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు మండలం నుంచి వెయ్యి వ్యక్తి గత ఇంకుడు గుంతలు, పొలాల్లో 10 ఫారంపాండ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీడీ రమేష్, ఎంపీడీఓ రఘునాథ గుప్త, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో చెరువులు

- ముళ్లపొదలతో నిండిపోయిన చెరువుగట్లు
- పట్టించుకోని అధికారులు
- ఆయకట్టు రైతులకు తప్పని ఇక్కట్లు



పోరెడ్డిచెరువు ఇదే



ప్రధాన కాలువలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

గాండ్లపెంట: మండలంలోని పలు గ్రామాల్లో చెరువు గట్లు ముళ్ల పొదలతో నిండిపోయి అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి ముళ్లపొదలను తొలగించకపోవడంతో గట్లు కాస్త చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు పొలాలకు దారి లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పంటకాలవల్లో ముళ్లపొదలు, పూడిక పేరుకపోవడంతో ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా దాదాపు 56 చెరువు లున్నాయి. వీటిలో పోరెడ్డిచెరువు కింద 147 ఎకరాలు, వేపరాల పంచాయతీలో వెంకటరెడ్డి చెరువు కింద 40 ఎకరాలు, తూపల్లి పంచాయతీ మడుగు వారిగొంది చెరువు కింద 60 ఎకరాలు, సామాలగొంది పంచాయతీలో జమాల్‌ఖాన్‌చెరువు, గంధోడి చెరువుల కింద 40 ఎకరాల చొప్పున, సోమయాజులపల్లి గండిచెరువు కింద 30 ఎకరాలు, కొత్తచెరువు కింద 20 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటితో ఇతర చెరువుల కింద వందల ఎకరాల్లో ఆయకట్టు భూములున్నాయి.

పట్టించుకునే వారేరీ..

మండలంలో చెరువుల నిర్వహణ గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో చెరువుగట్లు ముళ్ల పొదలతో నిండిపోయాయి. ఈక్రమంలో కంపచెట్ల వేర్లు లోపలకు చొచ్చుకెళ్లి గట్లు బలహీనమయ్యే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఉపాధి హామీ కిందనైనా చెరువుగట్లను బలోపేతం చేయాలని కోరుతున్నారు. ఇక పోరెడ్డి చెరువుకట్టపై భారీ ముళ్ల పొదలు పెరగడంతో రైతులు ఆయకట్టు పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులను అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పిల్ల కాలువలు ఏర్పాటు చేయాలి



పోరెడ్డి చెరువు కట్టతో పాటు ప్రధాన కాలువల్లో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. గతంలో కట్టపై భాగంలో మాత్రమే పొదలు తొలగించారు. దీంతో మళ్లీ పొదలు అలుముకున్నాయి. దీంతో రైతులు కట్టపైకి వెళ్లలేని పరిస్థితి. దీంతో పాటు ప్రధాన కాలువల ద్వారా దిగువ భాగాన ఉన్న భూములకు నీరు అందాలంటే పిల్ల కాలువలను ఏర్పాటు చేయాలి.

– బాలచంద్ర, ఆయకట్టు రైతు, సోమయాజులపల్లి

పంటలు సాగు చేయలేక పోతున్నారు



పోరెడ్డి చెరువు కింద 147 ఎకరాలు ఆయకట్టు భూములున్నా రైతులు పంట సాగు చేయలేక పోతున్నారు. చెరువు కట్ట ముళ్ల పొదలు పెరిగిపోవడంతో పొలాల్లోకి వెళ్లలేకపోతున్నారు. దీనికితోడు ఏళ్ల తరబడి సాగునీరు లేక పొలాలన్నీ బీడుగా ఉండటంతో వాటిలో కూడా కంపచెట్లు పెరిగాయి. ఉపాధి హామీ కింద వాటిని తొలగించాలి.

– మునగల చెన్నకృష్ణా రెడ్డి, ఆయకట్టు సంఘం మాజీ అధ్యక్షుడు, మునగలవారిపల్లి

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

మండలంలోని 56 చెరువుకట్టలపై అల్లుకుపోయిన ముళ్ల పొదలు, పూడికతీత, కట్టల పునఃనిర్మాణం తదితర పనులకు ఓఅండ్ఎం(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కింద ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కాలువలను ఆయా రైతులు శుభ్రపరుచుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు చేపడతాం.

– అరుణ, చిన్ననీటి పారుదల శాఖ ఏఈఈ

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తాం



కదిరిలో నూతనంగా ఎన్నికైన కన్వీనర్లను సన్మానిస్తున్న దృశ్యం



నల్లచెరువులో రవి కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్లు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కదిరి పట్టణాధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కదిరి రూరల్ కన్వీనర్ మూడే మణికంఠనాయక్, గాండ్లపెంట గజ్జల రవీంద్రనాథ్‌రెడ్డి, నల్లచెరువు ఎం.రవికుమార్‌రెడ్డి, ఎన్‌పీకుంట కొత్త రంగారెడ్డి, తనకల్లు మబ్బు ఆశోక్‌వర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు.

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నియమతులైన మొండెం రవికుమార్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసలంలో సర్పంచులు, ఎంపీటీసీలు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిథున్ రెడ్డి, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తిలో ఈనెల 12న తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ దోలా రామచంద్రారెడ్డి

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు అందరూ ఐకమత్యంతో పని చేయాలని పార్టీ మండల కన్వీనర్ దోలా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఓబుళంపల్లి గ్రామంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ చేసే ప్రతి కార్యక్రమం ప్రజలకు తెలిసేలా గ్రామ స్థాయి నాయకులు పని చేయాలన్నారు. అలాగే పార్టీ పరంగా సమస్యలు ఎదురైతే అందరూ కలసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారాతో ఆరోగ్యంపై దుష్ప్రభావాలు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గాండ్లపెంట: నాటుసారాతో ఆరోగ్యంపై దుష్ప్రభావాలు తప్పవని కదిరి ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ బాబురావు ఆధ్యక్షతన 'నవోదయం2.0'లో భాగంగా నాటుసారా నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. నేరం చేసిన వారికి 8 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తారన్నారు. నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్, అటవీశాఖ బీఓ బ్రహ్మయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: శ్రీసత్యసాయి జిల్లాను నాటుసారా రహితంగా మారుద్దామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పిలుపునిచ్చారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గరుగుతండాలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా నిర్మూలనపై తండా వాసులతో ప్రమాణం చేయించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎన్‌పీకుంట: నాటు సారా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారాతో కలిగే అనర్థాపై అవగాహన కల్పించారు. స్థానిక ఎస్ఐ వలిబాషా, రెవెన్యూ, ఎక్సైజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం సమత స్వచ్ఛంద సంస్థ, కదిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సంయుక్తంగా ఐసీడీఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మహిళలకు తోడ్పాటునందిస్తే దేశ ప్రగతిలో గణనీయమైన పాత్ర పోషిస్తారన్నారు. ఏ సమాజం స్త్రీని ఉన్నతంగా చూస్తుందో ఆ సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పథకాలు అందరికీ చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు చేశాయని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విశేష సేవలు అందించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, అరుణశ్రీ, ఎంఈఓ చెన్నకృష్ణ, శివలత, న్యాయవాదులు నరసింహులు, సంస్థ ప్రతినిధులు వెంకటేసులు, శ్రీనివాసులు నాయుడు, కొండప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆర్పీలపై కమిషనర్ బెదిరింపులు తగవు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కదిరి టౌన్: ఆర్పీలపై మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ బెదిరింపులు తగదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్.నరసింహులు, నాయకులు ముస్తక్, రామ్మోహన్ విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో ఇంటి, నీటి పన్నులు వసూలు చేయకపోతే డ్వాక్రా గ్రూపు ఆర్పీలను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ బెదిరించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. పన్నులు వసూలు చేయడానికి ప్రత్యేక విభాగం ఉందనే విషయాన్ని కమిషనర్ గుర్తు పెట్టుకోవాలన్నారు. పేద కుటుంబాల నుంచి పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న వారిని నిలువరించడంలో చూపాలని సూచించారు. పన్నులు వసూలు చేయాలని ఆర్పీలను వేధించడం ఆపాలని, మహిళలు పొదుపు డబ్బును తీసుకోవడానికి సంతకాలు పెట్టకుండా వేధిస్తే డ్వాక్రా మహిళలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామ సర్వేయర్లు

ప్రశాంతి నిలయం: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ సర్వేయర్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం వారు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రీసర్వేలో రోజువారీగా కేటాయిస్తున్న పని గతం కంటే ఎక్కువ పెంచారని, వాటికి తోడుగా సంక్షేమ సర్వేల్లో కూడా భాగస్వాములను చేస్తున్నారన్నారన్నారు. దీంతో భూ సర్వేపనులు చేయలేని పరిస్థితి నెలకొన్నారు. సర్వే పనుల కోసం అవసరమైన సామగ్రిని సక్రమంగా సరఫరా చేయడంలేదన్నారు. రీ సర్వే డిప్యూటేషన్లపై ఉన్న గ్రామ సర్వేయర్ల స్థానంలో ఇదే మండలంలోని గ్రామ సర్వేయర్లతో సదరు పని చేసేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. రీ సర్వే గ్రామాల్లో జరుగుతున్న పనులకు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసీజర్స్ మేరకు పని కేటాయించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు మహేష్‌నాయుడు, బాలునాయక్, హరీష్, నేత్రావతి, రఘునాథ్, మనోహర్, హరీష్‌కుమార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కనగానపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్షత్రియ, రెడ్డి, వైశ్య బ్రహ్మణ, కాపు వర్గాల్లోని పేద మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకుని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోండి

కదిరి అర్బన్: సైదాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు పొందిన రైతులు ఈ నెల 20 తేదీలోగా వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సంఘం సీఈఓ హనుమంతరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెన్యూవల్ చేసుకుని ప్రభుత్వం నుంచి రాయితీలు పొందాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడిమర్రి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం తాడిమర్రి, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, కునుకుంట్ల, పిన్నదరి, దాడితోట, చిల్లవారిపల్లి, చిన్న చిగుళ్లరేవు తదితర గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వీధిల్లో తిరుగుతూ మురుగునీటి గుంతలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి శుభ్రం చేయించారు. అలాగే తాగునీటి తొట్లెలు, డ్రమ్ముల్లో నిల్వచేసిన నీటిని పారబోయించారు. ఏఎన్ఎంలు కోమలి, సుగుణమ్మ, లక్ష్మీకాంతం, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగ నాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: రైతు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం(సీపీఎం)జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం(సీపీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందన్నారు. కలెక్టరేట్ ముట్టడికి రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారుతి, ఎస్‌హెచ్ బాషా, ఆదినారాయణ, హైదర్‌వలి, రామ్మోహన్, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

తిమ్మమ్మమర్రిమానును సందర్శించిన డీఎస్‌ఓ



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న డీఎస్‌ఓ, కుటుంబ సభ్యులు

ఎన్‌పీకుంట: గూటిబైలు గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మమర్రిమానును శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌ఓ) వంశీకృష్ణారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్రిమాను విశిష్టత, ఆలయ చరిత్రను టూరిజం గైడ్ మనోహర్ వారికి వివరించారు. అనంతరం వారు తిమ్మమాంబ, బాలవీరయ్య విగ్రహాలను, మర్రిమాను పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, వీఆర్‌ఓ దీపిక, లక్ష్మీనారాయణరెడ్డి, జయరామ్, వెంకటనారాయణ ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించండి

ధర్మవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో జీవించాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సి.బత్తలపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యానికి బానిసలు కావొద్దన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే ఊరుకోం'

పుట్టపర్తి టౌన్ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే ఊరుకోమని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సాయి ఆరామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చేసిన ప్రతిపాదనతో ఎస్టీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలని తాము అడుగుతుంటే కొత్తగా వాల్మీకులకు ఎస్టీ జాబితాలోకి చేర్చాలని చెప్పడం దుర్మార్గమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్టీలకు పెద్ద పీట వేస్తూ నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్టీలకు రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వకపోగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని యత్నించడం సరికాదన్నారు.

హైవే పనుల అడ్డగింత

నల్లమాడ: పొలాల రస్తాను మూసివేయడాన్ని నిరసిస్తూ కుటాలపల్లి, కుటాలపల్లి తండా వాసులు శుక్రవారం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులను అడ్డుకున్నారు. హైవే రోడ్డుకు ఆవలివైపున వేలాది ఎకరాలు భూములున్నాయని, దారి మూసివేస్తే తాము ఎలా రాకపోకలు సాగించాలంటూ నిర్వాహకులను నిలదీశారు. దారి వదలాల్సిందేనంటూ పట్టుపట్టారు. సమస్యను కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్తామని నిర్వాహకులు తెలపడంతో రైతులు వెనుదిరిగారు.

సంక్షిప్త సమాచారం

తోటకు నిప్పు

తనకల్లు: నందిగానిపల్లికి చెందిన రాజశేఖర్ రెడ్డికి చెందిన తోటకు శుక్రవారం ఆకతాయిలు నిప్పు పెట్టడంతో నిమ్మ, అల్లనేరేడు, ఉసిరి చెట్టు కాలిపోయాయి. వివరాలు.. గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి నిమ్మ, అలనేరేడు, ఉసిరి చెట్లను సాగు చేస్తున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు తోటకు పక్కన ఉన్న గడ్డికి నిప్పు పెట్టడంతో గాలికి మంటలు తోటకు వ్యాపించాయి. దీంతో తోటలోని 80 నిమ్మ, ఉసిరి, అల్ల నేరేడు చెట్లతో పాటు 10 ఎకరాల్లో సాగు చేసిన ఉలవ పొట్టు కాలి బూడిదైనట్లు బాధిత రైతు తెలిపాడు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు నుండి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తాడిమర్రి: మండల కేంద్రంలోని బాలాజీ థియేటర్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆత్మకూరుకు చెందిన రాగే రామాంజనేయులు ఉరఫ్ గజ్జెప్ప రాత్రి 7 గంటల సమయంలో టీవీఎస్ 50పై పార్నపల్లి వైపు బయలుదేరాడు. ఎదురుగా వచ్చిన వాహన వెలుతురులో కనిపించక ఆయన ముందు వెళుతున్న నార్పలకు చెందిన పెయింటర్లకు వాహనం తగులుతుందని ముందరి బ్రేక్ వేశాడు. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోర్ల పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి అదృశ్యం



మహవీర్(ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. గాంధీనగర్‌కు చెందిన మలిసాగన్‌లాల్ కుమారుడు మహవీర్ విక్టోరియా స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం క్రీడా మైదానంలోకి ఆడుకునేందుకు వెళ్లిన విద్యార్థి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు, చుట్టుపక్కల గాలించారు. అయినా ఆచూకి తెలియకపోవడంతో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

ధర్మవరం రూరల్: ఏలుకుంట్లలో శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని మాల కులస్తులు కోరారు. ఈమేరకు వారు మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు రత్న ఓబిలేసు, డీవీఎంసీ మెంబర్ రామన్న, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇండ్ల రమేష్‌బాబుతో కలిసి శుక్రవారం ఆర్డీఓ మహేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 94 సర్వే నెంబర్ వంక పొరంబోకులోని 0.86 సెంట్ల భూమిలో 60 ఏళ్ల నుంచి మృత దేహాలను ఖననం చేస్తున్నారన్నారు. ఆ భూమికి పక్కనే ఉన్న అమర నారాయణ అనే వ్యక్తి సుమారు 50 సెంట్లను ఆక్రమించాడన్నారు.